# చిరుధాన్యాల ఉత్పత్తులకు ప్రభుత్వ బ్రాండ్

## ● కర్ణాటక బ్రాండ్‌తో రాగి ఉత్పత్తుల మార్కెటింగ్

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: అంతరించిపోతున్న చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని జాతీయ, అంతర్జాతీయ పరిశోధన సంస్థలు నిర్ణయించాయి. ఇందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక ముందుకొచ్చింది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి రాగి ఉత్పత్తులను కర్ణాటక బ్రాండ్ పేరుతో మార్కెటింగ్ చేయాలని నిర్ణయించింది. శుక్రవారం ఇక్రిశాట్‌లో జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణాటక వ్యవసాయశాఖ మంత్రి కృష్ణబైరెగౌడ విలేకర్లతో మాట్లాడుతూ భారత్‌లో 60 శాతం రాగి పంట కర్ణాటకలో సాగవుతోందన్నారు. వరి, గోధుమల మాదిరిగా కేంద్రం చిరుధాన్యాలకు మద్దతు ధర ఇవ్వడం లేదని చెప్పారు. రాష్ట్రంలో రాగి పంటను ప్రోత్సహించడానికి మార్కెటింగ్ బాధ్యతలు చేపడుతున్నామన్నారు. వరి సాగుకు నీటి అవసరం ఎక్కువగా ఉంటుందని, చిరుధాన్యాలు మాత్రం 300 మి.మీ. వర్షపాతంతో మెట్ట ప్రాంతాల్లో సాగవుతాయని వివరించారు. వరికి ప్రత్యామ్నాయంగా రాగి పంటను ప్రోత్సహిస్తున్నామన్నారు. గతేడాది 24 లక్షల క్వింటాళ్ల ఉత్పత్తి వచ్చిందని అన్నారు. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో బ్రాండ్ వేసుకోవడానికి ఆయా ప్రభుత్వాలు ముందుకొస్తున్నాయని భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త దయాకర్‌రావు అన్నారు. ఏపీలో కొర్రల సాగుకు రూ.37 కోట్లు విడుదల చేశారని, కొర్రల ఉత్పత్తి రాష్ట్రంగా బ్రాండ్ వేసుకుంటున్నారని అన్నారు. జొన్న పంటపై తమ బ్రాండ్ వేసుకోవడానికి మహారాష్ట్ర ముందుకు వచ్చిందని చెప్పారు. ఐదేళ్ల ప్రాజెక్టు కింద జొన్నపై పరిశోధనలు జరుగుతున్నాయని వివరించారు. తెలంగాణలో పచ్చజొన్నలకు పేరుందని,దీనిపై ప్రభుత్వంపై చర్చించనున్నామని అన్నారు. వర్షాధారంగా సాగు చేసేలా కరవును తట్టుకునే వంగడాలు ఇక్రిశాట్ భాగస్వామ్యంతో రూపొందించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డేవిడ్ బెర్గిన్సన్, శాస్త్రవేత్త ఎస్పీ వాణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దయాకరావు, వేదికపై కృష్ణ బైరెగౌడ, డేవిడ్ బెర్గిన్సన్ తదితరులు (ఎడమ నుంచి కుడికి)